
కథ

# దొరలు

పారుపూడి సూరి



ఆదివారమైనా తప్పనిసరై అర్జంటుగా వూరెళ్లాల్సి వచ్చింది.

బస్‌స్టాండ్‌కు వచ్చాడు మూర్తి.

యాదగిరి వెళ్లే యాత్రికుల రద్దీ ఎక్కువగా వుంది.

పాన్‌పరాగ్ నోట్లో గుప్పించి ఓ మూల నిల్చొని చిరాకుగా పరిసరాల్ని పరికించడం ప్రారంభించాడు.

జనం అతన్ని నిల్చున్నచోటు నిలవనీయడం లేదు. , మధ్యలో స్కూటర్లు, సైకిళ్లు అడ్డదిడ్డంగా తిరుగుతూ పిచ్చెక్కిస్తున్నాయి. లారీలు రోడ్డును ఆక్రమించి ప్రయాణికుల్ని ఎక్కించు కుంటున్నాయి. బస్‌కోసం నిరీక్షించే ఓపిక లేకో, బస్‌టిక్కెటు ఇచ్చుకునే స్థోమత లేకో వాటిని ఆశ్రయిస్తున్నారు జనం. స్త్రీపురుష తారతమ్యం, పరమత భేదం, జంతుమానవ వ్యత్యాసం అక్కడ చోటు చేసుకోవు. కిందా మీదా పడి గమ్యం చేరుకోవడం ప్రధానం! లారీ డ్రైవర్ల వద్ద మామూళ్ళు పుచ్చుకుని ట్రాఫిక్ పోలీసు టీకొట్టు వద్ద బల్లమీద కూర్చుని విలాసంగా టీ తాగుతున్నాడు.

ప్రజలు వేసే యక్షప్రశ్నలకు తట్టుకోలేక ఆర్‌టిసి కంట్రోలర్ దూరంగా తొలగిపోయి సిగరెట్టు వెలిగించాడు.

బస్సుస్టాపులో జనం పాపంలా పెరిగిపోతున్నారు. చిన్నాపెద్దా, ముసలీ ముతకా అందరిదీ ఒకటే ఆరాటం. 'బస్ ఎందుకు రాలేదూ?'

గాలికి వింతగా కదులుతున్న పరికిణీలు, రెపరెప లాడుతున్న ఓణీలు, వాటివెనుక కవ్వించే పరువాలు - యువకులు వుత్సాహంగా వున్నారు ఆ కలరింగ్ చూసి...

ఇంతలో జనంలో కోలాహలం! జిరాఫీల్లా మెడలు సారించి అందరూ ఒకేవైపు చూస్తున్నారు. మూర్తి కూడా తన వంతుగా చూశాడు.

రోడ్డు సిగ్నలు దాటి లంఖణాల బండిలా కదిలివస్తోంది ఎర్రటి ఆకారం!

యుద్ధానికి సంసిద్ధమవుతున్నట్లు యువకులు చేతులు మడిచారు. నారీమణులు పంటలు బిగించారు. వయసు పిల్లలు పరికిణీలు, ఓణీలు సర్దుకున్నారు. ఆ సందడిలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఆకతాయిలకు దూరంగా తొలగి అప్రమత్తం అయ్యారు ఆడకూతుళ్లు.

బస్ వచ్చింది. అందరి ఆశలు వమ్ము చేస్తూ ముందుకు వెళ్ళిపోయింది. జనాన్ని గమనించి డ్రైవర్ ఆమడదూరంలో బస్సు ఆపాడు.

జనంలో పి.టి.ఉషలు, కార్ల్‌లూయిస్‌లు స్ప్రింట్ పరుగు అందుకున్నారు. మిగతావారు దేముడిమీద భారంవేసి వడిగా అడుగులు వేశారు.

బస్ చుట్టూ జనం ఈగల్లా ముసిరారు. తాము ఎక్కరు. ఇంకొకరిని ఎక్కనీయరు. డ్రైవర్, కండక్టర్ నిస్సహాయంగా చూస్తుండిపోయారు.

మూర్తి తన సంచీని కిటికిలోంచి అనధికారికంగా సీటు రిజర్వు చేసుకున్నాడు. నిదానంగా తలుపు వైపు నడిచాడు.

పది నిమిషాల హోరాహోరీ పోరాటం అనంతరం బస్‌లో చాలామంది చేరుకున్నారు. ఎక్కవల్సిన వారు చాలామంది మిగిలిపోయారు. డ్రైవర్ ఒక్క వూపుతో ముందుకు లాగించాడు. కొందరు నిలదొక్కుకున్నారు. కొందరు ఇతర్లమీద పడి తిట్టుకున్నారు.

జనాభా భారంతో భారతదేశంలా క్రుంగిపోతోంది బస్సు. నత్తలా కదులుతోంది.

లోపల నిల్చున్నవారికి, కూర్చున్న వారికి అంతే అసౌకర్యంగా వుంది. ఆనుకుని నిల్చునేవారు, భుజాలమీదకు వంగేవారు, నిల్చోలేక చతికిలపడ్డ ముసలివాళ్లూ. మూర్తి పరిస్థితి అలానే వుంది. దానికితోడు పక్కన కూర్చున్న పిల్లల తల్లి పిల్లాడి కాళ్ళ అతని ఒడిలో వేసి నంగనాచిలా ఎటో చూస్తోంది. ఆ పిల్లాడు కాళ్ళతో తన్నడంతో అతని చిరాకు పెరిగింది. కానీ తప్పదు. ప్రయాణం చేయాలి కదా.

బస్సు నడుస్తోంది.

మూర్తిపక్కన ఓ ముసలతను నిల్చున్నాడు. వృద్ధాప్యం, పరిస్థితుల ప్రభావం కామోసు... సన్నగా వణుకుతున్నాడు. వీసమెత్తు మాంసం లేదు. ఒత్త ఎముకల పోగు. చిరిగిన జుబ్బా, మాసిపోయిన రంగుమారిన పంచె. అతుకుల చెప్పులు. జట్టంతా పండిపోయి ఎండిపోయింది. పళ్లు రాలిపోయినా దవడలు చప్పిడి పడివున్నాయి. ఆ పీక్కుపోయిన దవడల మీద నెరసిన గడ్డం రెల్లుగడ్డిలా వుంది. అతని ఆకారం దరిద్రానికి ప్రతిబింబంలా వుంది. కుంగి కృశించిపోయిన ఆ శరీరం అతను శ్రమించి, శ్రమించి అలిసిపోయాడా అనేందుకు తార్కాణం.

అతనిపక్కన నిల్చున్నది మనుమరాలు అనుకుంటా! తిన్నది ఒంటబట్టి నిగారించి వుంది. ఆ మొహంలో ఏదో ఆకర్షణ. బస్సులో అందరి చూపులూ ఆమెమీదే. ఇబ్బందిగా కదులుతూ మాటిమాటికి చంకలో పిల్లాణ్ణి సర్దుకుంటోంది. పిల్లాడు తల్లి మొహంమీద కొడుతూ కేరింతలు కొడుతున్నాడు.

అతని టెన్షన్... చిరాకు...

'పైసలు ఏడవి? పోయాయి బిడ్డా...' అంతకన్నా విడమర్చి చెప్పలేకపోయాడు. తన వూరు ఎలా చేరాలి అనే నిరాశతో కుంగిపోతున్న అని నోటిలోంచి మాట రావడంలేదు. బెంగా, ఆందోళన పూర్తిగా ఆక్రమించుకున్నాయి. గుండె ఎగసి కొట్టుకుంటోంది. మొహంలో ముడతలు కొటానుకోట్లు కనబడుతున్నాయి.

'దానికి నన్నేం చేయమంటావు? ఎవర్నో ముష్టెత్తు...' కండక్టర్ నిర్దయగా అన్నాడు.

ఆ ముసలతను మనసు చంపుకుని సిగ్గువిడిచి అర్థించాడు.

'ధర్మప్రభువులు. ఎవరన్నా పుణ్యం కట్టుకోండి బాబూ. రెండు టిక్కెట్లకు పైసలివ్వండి దొరలూ...'

అంతవరకూ తమాషా చూస్తోన్న వారు 'దీన్నే ఘరానా ముష్టి అంటారు. ప్రతి వాడికి ఇదో వ్యాపారం అయిపోయింది. డబ్బులు పోయాయని ఏడ్వటం, ముష్టెత్తుకోవడం... వెధవ నాటకాలు...' తలో మాటా విసిరారు.

అతను సిగ్గుతో చితికిపోయాడు 'నేనలాంటోడ్ని కాదు బిడ్డా. ఇంటికాడ పసిగుడ్డునొదిలి వచ్చాను. ఆకలితో నకనక లాడిపోద్ది. పుణ్యం కట్టుకోండి దొరలూ...' కళ్ళలో నీళ్ల చిపిల్లుతుండగా చేతులెత్తి నమస్కరించాడు.

'పైసలు తీస్తవా... దించేమంటావా...' కండక్టర్ చేతులు అతని భుజాల మీద పడ్డాయి.

'పోయినాయని చెప్పినాను కదా బిడ్డా...' వంతపాడాడు.

. 'ఇదెక్కడి ఖర్మరా! పైసలు పోతే నేనా దానికి బాధ్యుడ్ని? బుర్ర తినేస్తున్నావు కదయయ్యా! నీలాంటి బేరం ఒకటి దొరికితే చాలు, మూడ్రోజులు డ్యూటీ ఎగ్గొట్టాలి. ముందు పైసలు ఇవ్వ...' నుదురు కొట్టుకుంటూ అరిచాడు కండక్టర్.

'నన్ను గుట్టలో దింపి పుణ్యం కట్టుకో! అప్పో, సప్పో చేసి అక్కడ ఇచ్చుకొంటాను' పుట్టిన గడ్డ మీద తన పరువు నిలుస్తుందనే ధీమాతో వేడుకున్నాడు.

'నీలాంటి వారిని ఇంతమందిని చూసాను. ఇంత మందిని' అంటూ వెంట్రుకలు గుప్పెట్లో పెట్టి వేళాకోళం చేసాడు. వెంటనే 'అదంతా కుదర్దు! పైసలియ్యి - లేకుంటే దిగిపో... ముందు చెకింగ్ వుంటుంది. నా ఉద్యోగాన్కి ఎసరు పెట్టకు' కండక్టర్ చేయి అతని మెడ మీదకు మారింది. ఇహ దిగమన్నట్లు.

ముసలతను బస్సంతా పరికించాడు. ఇంతమందిలో ఒక్క మనసున్న మనిషి లేడా అన్నట్లు' దిగవే!'' అన్నట్లు మనవరాలికి సౌంజ్ఞ చేశాడు.

ముసలతను మనుమరాల్ని వూ పట్టుకుని ఒకచేతిని జుబ్బాలోకి దూర్చాడు.

ఇంతలో చంకలో పిల్లాడు నిర్విచారంగా వంటేలు పోశాడు. బాంబు పడ్డట్టు అందరూ పక్కకు తొలిగారు. మూర్తి అచేతనంగా తన సంచీనిలోపలకు లాక్కున్నాడు. క్షణం ఆలస్యమైతే ఆ పవిత్ర జలంతో సంచీ నిండిపోయి వుండేది.

ఇహ కండక్టర్ వీరాభిమన్యుడిలా స్వైరవిహారం చేసుకుంటూ వస్తున్నాడు.

ముసలతన్ని చూసి 'ఎక్కడికి?' అన్నాడు.

'గుట్ట రెండు...'

'పైసలియ్యి...' టికెట్ అందించాడు.

జుబ్బా జేబులో చేతులుంచిన అతను నివ్వెరపోయాడు. కృశించిన ఆశరీరం ఎండుటాకులా వొణికింది. కంగారుగా ఒళ్ళంతా వెతుక్కున్నాడు. ప్రయోజనం లేదు. శరీరం చమటతో తడిసిపోయింది. చివరి ప్రయత్నంగా పంచెలో దోపిన సంచీని దులిపి దులిపి మరీ చూశాడు. ఊహూ. ఆశ నశించిపోయింది.

నిరాశ, నిస్పృహ, నిస్త్రాణం కొట్టొచ్చినట్టు కనిపించింది. వొణికే కంఠంతో 'బిడ్డా! డబ్బులు కొట్టేసింర్రు' అన్నాడు.

'నీ యవ్వ! టిక్కెట్లు కొట్టలేక చస్తుంటే నీ సోదొకటి. పైసలు తియ్' కండక్టర్ విరుచుకుపడ్డాడు. ఉప్పలు చేరేలోపల టిక్కెట్లు కొట్టడం పూర్తిచేయాలి. అదీ

అతని మనువరాలు చేష్టలుడిగి చూస్తోంది. చంకలో పిల్లాడు తన మానాన తాను ఆడుకుంటున్నాడు.

'ఎంత పోయిందేమిటి?' అడగాలనే కుతూహలం ఒకరిది.

''ఓ వంద రూపాయల కాగితం, మరో పది కాగితం - ఇందులో పెట్టాను...'' నిజాయితీగా జుబ్బా జేబును చూపించాడు.

అందరూ మరోమారు ఆశ్చర్యంగా చూశారు అతని వంక. 'వీడిద్గర ఇంత డబ్బా' అన్నట్లు...

'బస్‌లో ఎక్కుతుంటే ఎవడో పుణ్యం కట్టకొని వుంటాడు' అలాంటి చేదు అనుభవాలు ఎన్ని చూసాడో, ఓ యువకుడు విపులీకరించాడు.

'లేదు బిడ్డా! లోపలకు వచ్చి చూచుకోన్నాను. అప్పుడున్నాయి'

'మరైతే ఇక్కడే ఎక్కడో పడుంటాయి. వెదుకు...' మరొకరి వుచిత సలహా!

'మీ వెర్రిగాని పోయిన డబ్బు దొరుకుతుందా?' మరో అనుభవజ్ఞుడు అన్నాడు.

ఆ ముసలతను ఆశ చావక మరోసారి బస్సంతా వెతికి వేసారిపోయాడు. వృద్ధాప్యం మీద హఠాత్తుగా మరో ఏభై ఏళ్ళు పడ్డంత నీరస పడిపోయాడు.

కండక్టర్ తిరిగి యమదూతలా తయారయ్యాడు.

'పైసలు దొరికినయా?'

'లేదు బిడ్డా...'

'అతనంత బ్రతిమాలుతుంటె వినరాదటయ్యా! స్టాపుకు పోలీసోళ్ళను అప్పనంగా ఎక్కించుకుంటావు' ఆర్‌టిసి మీదున్న దుగ్ధతో అన్నాడు ఒకతను.

నిప్పు తొక్కిన కోతి అయ్యాడు కండక్టర్. తన తప్పును వేలెత్తి చూపటంతో మండిపోయింది'' ఎవరా మాటన్నది? చెప్పేవి శ్రీరంగనీతులు, దూరేవి దొమ్మరి గుడిసెలు. అందరూ అందరే! లంచాలు తినటం - ఏమీ ఎరగనట్లు మళ్ళీ ఫోజులు. మేమంతా పాపులమే - నీవా పనిచేసి పుణ్యం మూట కట్టుకోరాదూ? వెధవ సలహా ఎవడికి కావాలి?' కథక్కళి చేసాడు.

మూర్తికి అన్పించింది. తనా టిక్కెట్లు కొనిస్తే బావుంటుందని. కాని అతనూ మందలో మనిషే!

'సర్లే బిడ్డా! దిగిపోతాను. నా రాత బావుండలేదు. చెమటోడ్చి సంపాదించినది పోయింది. కడుపుకొట్టి సంపాదించినది కాదు కష్టార్జితం! పోయింది ఏం చేస్తాం?...'' అంటూ మనవరాలి ఆసరాతో జనాన్ని తోసుకొంటూ దిగటాన్కి వెళ్ళాడు.

బస్ ఉప్పల్ చేరుకొంటోంది. సముద్రంలా వున్న జనాన్ని చూసి రాడ్ మీద రెండుసార్లు గట్టిగా కొట్టాడు కండక్టర్. డ్రైవర్, బసును ముందుకు లాగించేసాడు. కొంతమంది పరిగెత్తి అందుకోలేక ఆగిపోయారు. ఇహ ఎవరూ రాలేరు అని నిర్ధారణ చేసుకొని బస్‌ను దూరంగా ఆపాడు.

ముసలతను, మనవరాలు, చంకలో పిల్లాడు ఈదురోమంటూ దిగిపోయారు. బస్ మరికొంత దూరంవెళ్ళి ఆగింది. కండక్టర్ ఎసిఆర్‌ను చెక్ చేసుకోవటం మొదలు పెట్టాడు. టిక్కెట్లు ఇచ్చి అలిసిపోయినట్లు అతని మొహం చెప్తోంది.

బస్‌లో రొద తగ్గటంతో మూర్తి సంచిలోంచి పుస్తకం తీసాడు. పక్కనున్న ఆవిడ ఒళ్ళో పిల్లాడు ఏ కళనుందో నిశ్శబ్దంగా ఆడుకొంటున్నాడు.

నాలుగైదు పేజీలు తిరగవేసాడు. ముందుకు సాగలేదు. తిరిగి పెట్టబోతూ అసంకల్పితంగా సంచిలోకి చూసాడు. అతన్కి మతి పోయినంత పని అయింది.

సంచిలో వంద రూపాయల నోటు కన్పించింది. ఆశ్చర్యంగా చేయి పెట్టి వెతికాడు. ఇంకో పది నోటు కన్పడింది. చిన్న మతలు పెట్టిన ఆ నోట్లు ఎంతో పరికరించి చూస్తేగాని అగుపించవు. అతని మనసు స్పందించింది. ఎంత పని జరిగింది? ముసలతను డబ్బు లెక్క చూసుకొని జుబ్బా జేబులో పెట్టు కోవటంలో జారి తన సంచిలో పడుంటాయి. ఇంతలో పిల్లవాడు అఘాయిత్యం చేయటంతో తను సంచిని లోపలకు లాక్కోవటం జరిగింది. ఆ సంచి ముసలతిని దృష్టిలో పడుంటే నిస్సంధేహంగా వెతికి వుండేవాడు. ఆ అవకాశాన్ని తను కాజేసాడు. అతనంతలా విలపిస్తుంటే కనీసం తన బుర్రకు ఈ సందేహం రాకపోవటం వింతగా వుంది. అవతల వాడి ఆక్రోశన వినలేని, అర్థం చేసుకోలేని తన చదువెందుకు? అందరిలో ఒకడిలా మిగిలిపోయాడు. సగటు మనిషిలా అయిపోయాడు. ఇంకా సమయం మించి పోలేదు.

ఆతృతగా కిటికీలోంచి తొంగి చూసాడు. ఆ ముసలతను, వారు బస్‌కు వంద గజాల దూరంలో వున్నారు. అదే సమయంలో బస్ కదిలింది.

మూర్తి పూనకం వచ్చినట్లు గట్టిగా అరిచాడు 'కండక్టర్'! బస్ ఆపు...''

డ్రైవర్‌తో సహా అందరూ వింతగా అతని వంక చూసారు. కండక్టర్ చిరాగ్గా అన్నాడు 'మళ్ళీ ఏం ముంచుకొచ్చింది?..'

మూర్తి సీటులోంచి లేచి తుపాకీ గుండులా ముందుకు దూసుకువెళ్ళాడు.

'ఆ ముసలతన్ని ఎక్కించుకోండి' అర్థించాడు.

'బస్ ఓవర్ లోడయింది. వాళ్ళ టిక్కెట్టు ఎవడు కొంటాడు? నీవా?'

'నేనిస్తాను. ముందు బస్సాపు...'

'ఒరే ఆపరా! అని ఆ పని ముందే చేసి ఏడవచ్చునుగా' చిరాకు ప్రదర్శించాడు.

'పది కాలాలపాటు జీవించు బిడ్డా!' చేతులెత్తి నమస్కరిస్తుంటే వారించి తన సీట్లో కూర్చోబెట్టాడు.

, మనవరాలి కళ్ళలో కృతజ్ఞత! చంటి పిల్లాడు కూడా అదే గ్రహించినట్లు మూర్తి బుగ్గల మీద సున్నితంగా రాస్తూ వచ్చీ రాని భావంతో ఏదో అంటున్నాడు.

'తాతా నీ పైసలు దొరికినాయి! నా సంచిలో దొరికాయి'

'అట్ట నా బిడ్డా! టిక్కెట్టు డబ్బు తీసుకొని మిగతాది యివ్వడం!' అది అతని ఆత్మాభిమానాన్కి తార్కాణం!

మూర్తి నచ్చ చెప్పబోయాడు.

'నీ డబ్బు నాకొద్దు! నా పైసలు నాకు దొరికినాయి. చాలు. మంచోడివి కనుక పిలిచి ఇచ్చావు... ఆ దేవుడు సల్లగా సూడాలి నిన్ను... నిజాయితీ ఇంకా చచ్చి పోలేదు బిడ్డా! అదింకా బ్రతికుంది...'

బస్ నడుస్తూ వుంది. మూర్తి ఆలోచనలు సాగిపోతున్నాయి!

ముసలివాడు... దరిద్రుడిలా కన్పిస్తున్నాడు కాబట్టి - వాడు నిజంగా... నిజం చెప్పినా ఎవరూ నమ్మలేదు - అదే టిప్‌టాప్‌గా వున్న యువకుడో, యువతో దొంగ నాటకం ఆడితే అందరూ సానుభూతి కురిపించి - ఇంగ్లీషులో కూడా బాధ పడి చేతనైన సాయం చేసి వుండేవారు... ఔరా ఈ లోకరీతి... దొంగల్లేని బస్‌లో అందరూ దొరలే!

తను మాత్రం తక్కువ తిన్నాడా? తన విషయం గుర్తుకు రాగానే సిగ్గుపడి రాడ్‌ను పట్టుకు వేలాడాడు మూర్తి...